జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 31-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 578 పేజీలు: 4 వెల : రూ.7

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే.. క్రిమినల్ కేసులు



* జగన్నాథ సాగరం కబ్జాపై దృష్టిసారించండి * డీ పట్టా భూముల్లో అనధికారికంగా ఉన్న వ్యక్తులకు నోటీసులివ్వాలి * అధికారులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే సహించను * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * మండల సర్వేయర్‌పై అసహనం * భూ ఆక్రమణ, అక్రమ తవ్వకాలపై ఎమ్మెల్యే శిరీషతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

పలాస, జనవరి 30(వార్త): ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టిందని, భూ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ఆయన పలాస, మందస మండలాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి, భూ ఆక్రమణలు, అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిని బాధ్యులను చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే తమ ప్రాధాన్యతని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా సూదికొండ, జగన్నాధ సాగరం, కోసంగిపురం ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, అక్రమ లేఅవుట్లు, చెరువు గర్భం ఆక్రమణలపై తీవ్రంగా స్పందించారు. జగన్నాధ సాగరం చెరువు గట్టును పునరుద్ధరించేందుకు వంశధార ఇరిగేషన్ అధికారులకు తక్షణమే ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణకు గురైన 350 మీటర్ల చెరువు గట్టును తక్షణమే సరిచేయాలని, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అలాగే, డి-పట్టా భూముల్లో అనధికారికంగా ఉన్న వ్యక్తులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలాస మండల సర్వేయర్‌పై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, తక్షణ చర్యలకు ఆదేశించారు.

## అక్రమాలకు తావులేదు: ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.
నియోజకవర్గంలో ఎక్కడైనా భూ ఆక్రమణలు జరిగినా, నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు చేపట్టినా సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి విఘాతం కలిగించే శక్తులపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్‌ను కోరారు. అదే సమయంలో, నిబంధనల ప్రకారం మట్టి, కంకర తవ్వకాలు జరుపుకునే వారికి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూముల రక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పలాస ఆర్డీఓ జి. వెంకటేష్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్ రావు పాల్గొనారు.




## నల్లబొడ్లూరు' కొండ పరిశీలన

మందస, జనవరి 30(వార్త): మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామం వద్ద గల కొండ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పలాస నియోజకవర్గం ఎంఎల్ఏ గౌతు శిరీషా, అధికారులు, నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన, జరుగుతున్న అక్రమ దోపిడీ, సహజ వనరుల దుర్వినియోగంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న దోపిడీదారులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండలు, సహజ వనరులు ప్రజల సంపదని, వాటి రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీఓ వెంకటేష్, మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఒరియా బ్రాహ్మణుల.. సంక్షేమానికి కృషి చేస్తా

* కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తాం * హైందవ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణులు ముందుంటారు * జగన్నాథ స్వామి ఆలయాభివృద్ధికి నివేదిక ఇవ్వండి * కోఆప్షన్ సభ్యులుగా ఒరియా బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తాం * ఎమ్మెల్యే గొండు శంకర్ * ఘనంగా ఒరియా బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళనం * గుండిచా మందిరం ఆవరణలో వెయ్యి మందికి అన్నదానం



శ్రీకాకుళం, జనవరి 30 (వార్త): ఒరియా బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడతానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం వద్ద ఉన్న గుండిచా మందిరంలో శుక్రవారం ఒరియా బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఐక్యతతోనే జాతి బలోపేతం అవుతుందన్నారు. హైందవ ధర్మ పరిరక్షణలో ఒరియా బ్రాహ్మణులు ముందుంటారన్నారు. ఒరియా బ్రాహ్మణులకు అవసరమైన రుణాలను బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందేలా చూస్తామని తెలిపారు. నగరపాలక సంస్థలో ఎన్నికలు జరిగినపుడు కోఆప్షన్ సభ్యులుగా ఒరియా బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టును శ్రీకాకుళం నియోజకవర్గానికి వచ్చేలా తనవంతు కృషి చేస్తానన్నారు. జగన్నాథ స్వామి ఆలయాభివృద్ధికి నివేదిక ఇస్తే నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. అలాగే ఒరియా బ్రాహ్మణుల కోసం సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. దీనికి అవసరమైన స్థలం పరిశీలించి తనకు తెలియజేయాలన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా ఒరియా బ్రాహ్మణులకు రుణాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ కార్పొరేషన్‌కు జవసత్వాలు వచ్చాయని చెప్పారు. కార్పొరేషన్ ద్వారా పేద ఒరియా బ్రాహ్మణులకు సాయం అందేలా తనవంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఒరియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి మాట్లాడుతూ ఒరియా బ్రాహ్మణులంతా సంఘటితంగా ఉండాలన్నారు. అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సంఘ ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాండ్రంకి శంకరరావు, పీఎంజే బాబు, ఒరియా బ్రాహ్మణ సంఘ నాయకులు బాలు పాణిగ్రాహి, రవిపాణిగ్రాహి, మహంతో, రమేష్, ప్రధాన అర్చకులు సుభాష్ పండా, సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు, జిల్లావ్యాప్తంగా ఒరియా బ్రాహ్మణ సంఘ నాయకులు, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ద్వాదశి సందర్భంగా గుండిచా మందిరం ఆవరణలో వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





## కల్తీ నెయ్యి సూత్రధారులపై చర్యలేవీ?

* ఎమ్మెల్యే కూన రవికుమార్
* ఆమదాలవలసలో కూటమి నేతల భారీ నిరసన ర్యాలీ



4లో

## తెలుగుదేశం వార్డులకే నిధులా?

* అభివృద్ధి కొన్ని వార్డులకేనా? * ఇదేనా సమ న్యాయం * నిధులు కేటాయింపుపై టీడీపీ-వైసీపీ కౌన్సిలర్లు వాగ్వాదం * గోతులు పూడ్చడానికి రూ.5 లక్షలా? * అధికారులపై ధ్వజమెత్తిన ఇచ్ఛాపురం మున్సిపల్ సభ్యులు

2లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పాతపట్నం సబ్ జైలును సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి

**పాతపట్నం, జనవరి 30(వార్త):** పాతపట్నం లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి సబ్ జైల్ ను శుక్రవారం సందర్శించారు. జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారిలో ఎవరికైనా అడ్వకేట్ లేకపోతే గవర్నమెంట్ అడ్వకేట్‌ను నియమిస్తామని సూచించారు ఖైదీల బేరక్, వాష్ రూమ్, స్టోర్ రూమ్‌ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఏజీపి బిఈ సత్యనారాయణ, జైలు సూపరింటెండ్ ఉన్నారు, అనంతరం స్థానిక కోర్టు హాలులో పాతపట్నం బార్ అసోసియేషన్ న్యాయ వాదులతో జడ్జి వాణి సమావేశం నిర్వహించారు. మార్చి 14న జరగనున్న లోక్ అదాలత్లో రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేలా కక్షిదారులకు తెలియజేయాలని సూచించారు కార్యక్రమంలో ఏపిపి రఘు నాదన్, బార్ ప్రెసిడెంట్ గేదెల సూర్యారావు, మెట్ట రామారావు, గొంటి రామ్మోహన్‌రావు, పడ్డ అప్పలనాయుడు, సిస్టు షణ్ముఖరావు, కూర్మాపు రామారావు, ఇతర బార్ మెంబర్స్ పాల్గొన్నారు.



# తెలుగుదేశం వార్డులకే నిధులా?

- -అభివృద్ధి కొన్ని వార్డులకేనా?
- -ఇదేనా సమ న్యాయం
- -నిధులు కేటాయింపుపై టీడీపీ-వైసీపీ కౌన్సిలర్లు వాగ్వాదం
- -కుక్కలు, కోతులు, పశువులపై చర్యలేవీ?
- -గోతులు పూడ్చడానికి రూ.5 లక్షలా?
- -అధికారులపై ధ్వజమెత్తిన ఇచ్ఛాపురం మున్సిపల్ సభ్యులు

**ఇచ్ఛాపురం, జనవరి 30(వార్త):** మున్సిపాల్టీలో అభివృద్ధి అంటే కొన్ని వార్డులేనా? ఇదేనా సమన్యాయం? అని కౌన్సిల్ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. మున్సిపాల్టీ పరిధిలో గల పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్లకు నిధులు కేటాయింపుపై వైసీపీ-టీడీపీ కౌన్సిలర్లు మధ్య వాగ్వాదం జరిగింది. కొన్ని వార్డులకే నిధులు కేటాయించారని, మిగతా వార్డులకు మున్సిపాల్టీకి సంబంధం లేదా ఇదేనా సమ న్యాయమంటే? అని వైసీపీ కౌన్సిలర్లు గువ్వడ ప్రదీప్‌కుమార్, సుగ్గు ప్రేంకుమార్ అధికారులను నిలదీశారు. దీంతో మా వార్డులకు నిధులు కేటా యిస్తే మీకేంటి అభ్యంతరమని తెలుగుదేశం కౌన్సిలర్లు గేదెల శేఖర్, కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, అశి లీలారాణి వైస్సార్సీపీ కౌన్సిలర్లతో వాగ్వాదానికి దిగారు. తాము కేటాయించిన వార్డులపై ప్రశ్నించడం లేదని అన్ని వార్డులకు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. చివరికి వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య ఇరు పార్టీల కౌన్సిలర్లకు సర్దిచెప్పారు. రెండో విడతలో 15వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి 3, 4, 5, 10, 18, 22 వార్డులకు మాత్రమే నిధులు కేటాయించటం, మిగిలిన వార్డులను విస్మరించటంపై వార్డు కౌన్సిలర్లు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి, అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు.





రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అద్దె ట్యాంకర్లు ద్వారా తాగునీటిని అందించేందుకు నిధులు కేటాయించి టెండర్లు పిలవడానికి కౌన్సిల్ ఆమోదం కోరారు. పలు వార్డుల్లో రోడ్ల గుంతలు పూడ్చేందుకు రూ.9లక్షలు కేటాయించి రెండు సార్లు పూడ్చారు. మళ్లీ గుంతలు పూడ్చేందుకు రూ5లక్షలు కేటాయించి కౌన్సిల్ ఆమోదం కోరడం ఏమిటని కౌన్సిలర్ బచ్చు జగన్ అధికారులను నిలదీశారు. ప్రజా ధనం దుర్వినియోగమవ్వడానికి అధికారులే అని కౌన్సిలర్లు విమర్శించారు. అధికారులే గుంతలు నిర్ధారించి నిధులు కేటాయించడమేంటి, కౌన్సిలర్లు అంటే మీకు లెక్కలేదా అని ప్రశ్నించారు. కనీసం ఇప్పటికైనా అధికారుల పర్యవేక్షణలో గుంతలు పూర్తిస్థాయిలో పూడ్చి బాగు చేయాలని కోరారు. 16వ వార్డు ఫకీర్‌పేట జంక్షన్ వద్ద గల ప్రభుత్వ పాఠశాల వద్దనే విద్యుత్ స్తంభం ఉందని, దీంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకా శం ఉందని, వెంటనే వేరే చోటకు మార్చాలని వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య కోరారు. వీధి కుక్కలు, కోతులు, పశువుల సంచారంపై ఎటువంటి చర్యలు చేపట్టారని నిలదీశారు. చికెన్, మటన్ షాప్‌లపై ఎటువంటి చర్యలు తీసుకు న్నారని వైస్ చైర్‌పర్సన్ స్వర్ణ మణి ప్రశ్నించారు. కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగపరచుకోండి



**మెళియాపుట్టి, జనవరి 30(వార్త):** పదో తరగతి విద్యార్థులు సత్ఫలితాలు సాధించడానికి సాక్షి దినపత్రిక వారు అందిస్తున్న స్టడీ మెటీరియల్ ప్రతి విద్యార్థి సద్వినియోగ పరుచుకోవాలని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సలాన వ్యాసగీత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల కొరకు స్టడీ మెటీరియల్ కంప్లీట్ గా తయారుచేసి ఇలా అందజేయటం విద్యార్థులకు మంచి పరిణామం అన్నారు. దినపత్రిక ప్రతినిధులు సర్క్యులేషన్ విభాగం నుండి గిరిబాబు, స్థానిక రిపోర్టర్ చాణిక్యలు శుక్రవారం నాడు మండలంలో గల చాపర, కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో చదువుతున్న 170 మంది విద్యార్థులకు ఆయా ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రిక ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సాక్షి దినపత్రిక ద్వారా స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందని మొదటిగా నియోజకవర్గంలో ఈరోజు చాపర, కోసమాల పాఠశాలలకు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

## మహాత్మునికి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పాతపట్నం, జనవరి 30(వార్త):** జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా పాతపట్నంలోని మహాత్ముని విగ్రహాలకు పూల మాలలు వేస పాతపట్నం శాసన సభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబెర్ మామిడి గోవిందరావు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మహాత్ముని ఆశయాలను కొనసాగించాలని విన్నవించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు



**మందస, జనవరి 30(వార్త):** ఉచిత పశు ఆరోగ్య శిబిరాలతో పాడి రైతులకు మేలు జరుగుతోందని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి అన్నారు. మందస మండలంలోని బైరిసారంగపురం, సిద్ధిగాం పంచాయతీల పరిధిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రెండు పంచాయతల పరిధిలో ఉన్న గ్రామాలలో వ్యాధినిరోధక టీకాలు వేయడం జరిగిందన్నారు. దూడలకు అంతర పరాన్నజీవులు మందులు తాగించడం, పాడి రైతులకు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, పశు బీమా, పశుగ్రాసాల సాగు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, రవి, కళ్యాణ్, ఇంతియాజు, మురళి, నిత్యానందం, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమ, మాసయ్య, సురేష్, విజయానంద్, శ్రావణితో పాటు పాడిరైతులు పాల్గొన్నారు.

## పైడి మురళీమోహన్‌కు శుభాకాంక్షల వెల్లువ



**సరుబుజ్జిలి, జనవరి 30(వార్త):** సరుబుజ్జిలి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పైడి మురళీమోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆయన 2014-2018 వరకు ఆ పార్టీ పార్లమెంటరీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా పని చేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేశారు. 2023 నుంచి జనసేన మండల పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నాడు, 2024 ఎన్నికల్లో కూన రవికుమార్ వెంట ఉండి ఆయన విజయానికి ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం ఆయన సరుబుజ్జిలి మండల పీఏసీఎస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

## తాళ్లవలసలో వరి చేలు కుప్పలు దగ్ధం

**సంతబొమ్మాళి, జనవరి 30(వార్త):** తాళ్లవలసలో శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు వరికుప్పలు, గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన దుబ్బాక పురుషోత్తం తన కళ్లంలో ఉంచిన రెండు ఎకరాల వరికుప్పలు, ఆరు ఎకరాల గడ్డికుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించిందని ప్రాథమిక అంచనా. వరికుప్పల సమీపంలో చెత్తకుప్పలు అగ్గి పెట్టడంతో మంటలు వ్యాపించి వరికుప్పలు కాలి బూడిదయ్యాయి. టెక్కలి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, మంటలను అదుపు చేశారు.

## 'శంకరరావు' కుటుంబానికి తెలుగుదేశం నాయకుల పరామర్శ

**మందస, జనవరి 30(వార్త):** కొంకడాపుట్టి పంచాయతీ కుల్లోగాం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, యూనిట్ కన్వీనర్ సవర శంకరరావు మరణించారు. టీడీపీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, ముఖ్య నాయకులు శంకరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. శంకర్‌తో ఉన్న అనుబంధాన్ని కుటుంబసభ్యులతో పంచుకున్నారు. శంకర్ మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శాసనసభ్యురాలు గౌతు శిరీష తరపున కొంత ఆర్థిక సహాయాన్ని అందించి, తెలుగుదేశం పార్టీ తరుపున ఎప్పటికీ అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల నారాయణపురం పంచాయతీలోని పెద్దకేసుపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మడియా దుర్యోధన మరణించడంతో.. ఆయన కుటుంబీకులను కలిసి, పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమం తమరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, మంగళపాత్రో, ముంజేటి చంద్రశేఖర్, మడియా ధర్మారావు, బొడ్డు వాసు, మాదక మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



## బుడ్డివలసలో బీటీ రోడ్డును ప్రారంభించిన కూన



**సరుబుజ్జిలి, జనవరి 30(వార్త):** బుడ్డివలసలో రూ.78 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఆమదాలవలస శాసనసభ్యులు, కూన రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ బీటీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజల ఎన్నో సంవత్సరాల కలను నెరవేర్చామని రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని, విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి నందివాడ గోవిందరావు, మండల అధ్యక్షులు అంబాల రాంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పైడి మురళీ మోహన్ మండల తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, కె.రవికుమార్, ఇ.ప్రభాకర్, కె.కోటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, సిహెచ్. వరాహకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంఎన్ఆర్ఈజీఎస్ చట్టం-2005ను పునరుద్ధరించాలి

**మందస, జనవరి 30(వార్త):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టం-2005ను పునరుద్దరించాలని, మోడీ తెచ్చిన జీఆర్ ఎఎంజీ 2025 చట్టాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పి దేవేంద్ర, ఎం ధర్మారావు, సీఐటీయు మండల కార్యదర్శి కె. కేశవరావు డిమాండ్ చేశారు. మందస, ఉమాగిరిలలో మహాత్మా గాంధీ స్పూర్తితో గ్రామీణ పేదలకు, రైతులకు, కూలీలకు అండగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం, వామపక్ష పార్టీల మద్దతుతో ఆధారపడిన యుపిఎ- 1 ప్రభుత్వం వామపక్ష పార్టీల ఒత్తిడి, కృషితో వచ్చిన 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడంతో గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు నష్టమని, పని హక్కు పోతుందన్నారు. ఎక్కువ మంది లేబర్ ఉంటే తక్కువ వేతనాలతో పని చేయించుకొని ఆర్థిక లాభం పొందవచ్చన్న కార్పొరేట్ల దురాలోచన, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పథకంను నిర్వీర్యం చేస్తూ వచ్చారన్నారు. 2021లో ఈ పథకానికి, రూ. లక్షా 11 వేల కోట్లు కేటాయించగా, 2024లో 2025లో కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించాని, పేదలకు ఉపయోగపడే ఈ పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. 2005 గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇస్తే, రాష్ట్రాలు 10% భరించేవని, ఈ కొత్త చట్టంలో 60% కేంద్రం, 40% రాష్ట్రాలు భరించాలని చెప్పిందన్నారు. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు కేటాయించలేవన్నారు. రాష్ట్రాలు ఖర్చు పెట్టాక కేంద్రం నిధులిస్తుందని, ఈ పథకాన్ని క్రమేపి ఎత్తివేసే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందన్నారు. ఇటువంటి పథకాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం సిగ్గుచేటన్నారు. దశాబ్దాలు పాటు కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మిక చట్టాలు స్థానంలో 4 లేబర్ కోడ్లుగా తెచ్చారన్నారు. కార్పొరేట్‌ల ప్రయోజనాలకు కార్మిక వర్గాన్ని మరింత శ్రమ దోపిడీ చేసి ఆధునిక బానిసలుగా మార్చడానికి లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. ప్రజలపై భారాలు వేసి ప్రైవేట్ విద్యుత్ కంపెనీలకు అధిక లాభాలు వచ్చే విధంగా కొత్త విద్యుత్ చట్టం తెస్తున్నారని అన్నారు. ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.లోలాక్షి, గుణాలమ్మ, గౌరమ్మ, తిలోత్తమ, శశి, నిఖిత, ప్రమీల, పి.దుర్యోధన, ప్రపోల్లో పాత్రో తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులు సమాజ ఆరోగ్యానికి వెన్నెముక

- డా.పైడి. సింధూర
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

### పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం

**శ్రీకాకుళం అర్బన్, జనవరి 30(వార్త):** పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టనివని, పారిశుధ్య కార్మికులు సమాజ ఆరోగ్యానికి వెన్నెముక అని డా.పైడి.సింధూర అన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ కమలాకర్, విశిష్ట అతిథి, మున్సిపల్ వైద్యాధికారి సుధీర్ కుమార్ మాట్లాడుతూ రథసప్తమి ఉత్సవాలలో నిస్వార్థ సేవకులు పారిశుధ్య కార్మికులని, సమయాన్ని కూడా లెక్కచేయక విధులు నిర్వర్తించిన తీరు మరువలేనిదన్నారు. వారికి శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ బృందం మాత్రమే గుర్తింపునివ్వటం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా.సింధూర మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల స్వచ్ఛత కార్యక్రమాలతో అందరి ఆరోగ్యానికి ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ వ్యవస్థాపకులు నటుకుల. మోహన్, జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ. రవికుమార్, వయోజన విద్య జిల్లా చైర్మన్ బాడాన. దేవభూషణ్ మాట్లాడుతూ పరిశుభ్రత ఎక్కడ ఉంటుందో, అక్కడ ఆరోగ్యం ఉంటుందని, వారం రోజుల రథసప్తమి వేడుకలలో వీరి సేవలు అమూల్యమని, నిజమైన సేవకులను ఈ రోజు గౌరవించటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు తమ కుటుంబం కోసం ఆలోచించి, సేవా కార్యక్రమంలో ఆరోగ్య సూత్రాలతోపాటుగా, జాగ్రత్తలను పాటించాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులందరికీ పండ్లు, పలాలు అందించి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టెక్కం. రామ్ గోపాల్, కార్యదర్శి బరాటం.కృష్ణ చైతన్య, మార్కెటింగ్ చైర్పర్సన్ పొడుగు. చరణ్, జనసేన జిల్లా సెక్రటరీ సుశీల కీర్తి, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



## ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలి



**పాతపట్నం, జనవరి 30(వార్త):** విద్యార్థి దశనుంచే ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని ధనిక్ భారత్ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ మల్లవరపు బాలలత అన్నారు పాతపట్నంలోని స్థానిక కె.యస్.యమ్ ప్లాజా లో పలు విద్యా సంస్థలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడుతూ మార్కులకే పరిమితం కాకుండా ఉన్నత లక్ష్యం తోపాటు నైపుణ్యంను కూడా పెంపొందించుకోవాలని మార్గ నిర్దేశం చేశారు, అలాగే యువత ఉన్నత ఉద్యోగాలు సాధించి నలుగురుకు మార్గనిర్దేశకులుగా నిలవాలని అకాంక్షించారు కార్యక్రమంలో ధనిక్ భారత్ సిబ్బంది, పలు విద్యా సంస్థల డైరెక్టర్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**జి.సిగడాం, జనవరి 30 (వార్త):** పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నామని, పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొవాలని మండల పశు వైద్యాధికారి ఉప్పాడ సుమన్ తెలిపారు. శుక్రవారం పెంట గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత, గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ ప్రారంభించారు. పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తూ. పలు జీవాలకు టీకాలు, వ్యాక్సిన్లు వేశారు. ఈ శిబిరాల్లో ఉచిత పశు వైద్యులచే ఉచిత వైద్యం తో పాటు తేలికపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. గొర్రెలకు ఉచితంగా బొబ్బ వ్యాధి నివారణ టీకాలు అందిస్తామని పేర్కొన్నారు. మేకలకు నట్టల నివారణ మందును అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మక్క నారాయణరావు, సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, గ్రామస్తులు మీసాల శ్రీను, మీసాల సంతుబాబు, లావేటి శ్రీను, మీసాల సూరిబాబు సచివాలయ సహాయకులు ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



## నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



**మెళియాపుట్టి, జనవరి 30(వార్త):** విద్యార్థి దశ నుండే విద్యతో పాటు వివిధ రంగాలలో ప్రతిభను కనబరిచి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బోరవెల్లి చంద్రమౌళి అన్నారు. మెళియాపుట్టిలో గల ఎస్‌డిఆర్‌ఆర్‌ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి ఇంటర్మీడియట్ తదుపరి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ప్రణాళిక యుతంగా ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించి, పదిమందికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వైకుంఠరావు, మాధవరావు, సంజయ్‌కుమార్ నాయికో, టి.మాధురిదేవి, ఎన్.సంతోష్‌కుమార్, కె.రమణమూర్తి, ఎన్.నలినికుమారి, పి.రోజా, వై.కృష్ణకుమారి, కె.నరసింహమూర్తి, పి.భూలోకరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి కాకూడదు : ఎస్ఐ



**నరసన్నపేట, జనవరి 30(వార్త):** నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై బి. గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ నియంత్రణ వంటి భద్రతా చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన సమాజంలోని ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత, రోడ్డు భద్రత అధికారులు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

# జగన్నాథసాగరం అక్రమాలపై కౌన్సిల్ గరం..గరం

**-రెవెన్యూ అధికారులకు ఎంతమేర ముట్టచెప్పారో తెలియాలి**

**-మున్సిపల్ పరిధిలో ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో?**

**-నిలదీసిన కౌన్సిలర్ పప్పల ప్రసాద్**





**పలాస, జనవరి 30 (వార్త):** జగన్నాథ సాగరం అక్రమాలపై 21 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పప్పల ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం మందిరంలో మున్సిపల్ చైర్మన్ గిరిబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలపై కౌన్సిలర్ అందరూ ముక్తకంఠంతో ఖండించారు. పలాస కాశీబుగ్గ నడిబొడ్డున ఉన్న జగన్నాథ సాగరం ఆక్రమణలకు గురైందని వాటిని తొలగించేందుకు రెవెన్యూ అధికారులకు మునిసిపల్ అధికారులు ఆదేశించాలని కౌన్సిలర్ పప్పల ప్రసాద్ డిమాండ్ చేశారు. నిర్వహించారు. సుమారు 58 ఎకరాలు విస్తీర్ణం గల సాగరం అక్రమార్కుల కబంధహస్తాల్లో చిక్కుకొని అన్యాక్రాంతం అవుతుందని, ఈ సాగరం ద్వారా జంట పట్టణాల ప్రజలకు తాగునీటితో పాటు సుమారు 1000 ఎకరాలకు సాగునీరు అందించే 80 అడుగుల వెడల్పు 1000 అడుగుల పొడవుతో సుమారు ఒక ఎకరా 70 సెంట్లు స్థలం ను ఆక్రమణదారులు ఆక్రమించుకున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చైర్మన్ బల్ల గిరిబాబు స్పందిస్తూ అక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ ఐ శ్రీనివాస్‌కు ఆదేశించారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక రంగంలో పరిగెడుతుండగా కులాల పేర్లతో వీధులు ఉండడం ఆక్షేపణీయమని వాటిని తొలగించి ఆయా వీధుల ప్రజల సూచనలు మేరకు వీధి పేర్లను ఖరారు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో వీధులకు కులాల పేర్లను తొలగించేందుకు సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. సమావేశం ప్రారంభించడానికి ముందు సమావేశంలో కొంత గందరగోళం నెలకొంది. హాజరైన సభ్యులు సంతకాలు చేయకుండా కోరం లేకుండా సమావేశం నిర్వహించలేమని చైర్మన్ కోత స్పష్టం చేయడంతో కౌన్సిలర్లు సంతకాలు చేసి సమావేశాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్ దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ వచ్చే మార్చి 18న కౌన్సిల్ పాలకవర్గం ముగుస్తుందని ఈ ఐదేళ్లలో కౌన్సిలర్లు తమ వార్డుల అభివృద్ధిపై మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఎజెండాలో ఉన్న పలు అంశాలను ప్రస్తావించారు. ప్రతి ఎజెండాలో వాహనాల ఖర్చులకే లక్షల రూపాయలు పెడుతున్నట్లు పొందుపరిచారని గత ఐదేళ్లలో ఏయే వాహనాలకు ఎంత ఎంత నిధులు ఖర్చు పెట్టారో..? కౌన్సిలర్లకు తెలియజేయవలసిన అవసరం అధికారులపై ఉందని అన్నారు. వాహనాల ఖర్చులకే రెండు లక్షల 50 వేల రూపాయలు అయినట్లు చూపించారని అవి ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ప్రశ్నించారు. సి బిల్లులతో మున్సిపాలిటీ పరిధిలో అత్యవసరమైన అభివృద్ధి పనులు చేస్తుంటారని దీనిలో భాగంగా రాధాకారత చెరువు మరమ్మతులు పనులు చేపట్టి రెండేళ్లు అవుతున్న వాటి బిల్లులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సి బిల్లులు రూపంలో ఇంత వరకు ఎంత నిధులు ఖర్చు చేశారు.. కాంట్రాక్టర్ ఎవరు..? తెలియజేయాలని డిమాండ్ చేశారు. 2002లో మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత మున్సిపాలిటీ ఆస్తులు ఏ మేరకు ఉన్నాయి. ప్రస్తుతం ఆక్రమణలకు గురయ్యాయా.? వాటికి సంబంధించి సమాచారం లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరారు. కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గల సులబ్ కాంప్లెక్స్ వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, కాశీబుగ్గ రైలు గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో కాశీబుగ్గ పోస్ట్ ఆఫీస్ వద్ద కాలువ వెడల్పు చేయాలని కోరారు. మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్, ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ లో అనేక షాపులు ఖాళీగా ఉండి మున్సిపల్ ఆదాయానికి తీవ్ర నష్టం వస్తుందని షాపులకు వేలంపాట నిర్వహించాలని కోరారు. దీనిపై రెవెన్యూ ఇన్స్పెక్టర్ అమర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు షాపులకు అద్దెలు పెంచామని, ఇప్పటికే కొంతమంది షాపు నిర్వాహకులు ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా న్యాయస్థానమును ఆశ్రయించారని తెలిపారు. రిజర్వేషన్ కోటా షాపులను కూడా సభ్యుల ఆమోదం మేరకు వేలంపాట నిర్వహిస్తామని సభ్యులకు తెలిపారు. కౌన్సిలర్ పట్టా మాధవి మాట్లాడుతూ 6 నెలల క్రితం వీధిలో పబ్లిక్ కొళాయి ఏర్పాటు చేయాలని కోరిన ఇంత వరకు ఏర్పాటు చేయలేదని కనీసం ఎజెండాలో కూడా పొందుపరచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పబ్లిక్ కొళాయిల ఏర్పాటు ప్రభుత్వం రద్దు చేసిందని మున్సిపాలిటీలో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో భూ అక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ భూములనేవి ఈ ప్రాంతంలో ఉండవని అన్నారు. ఆక్రమించుకొని ఇళ్ళు నిర్మాణాలు చేస్తున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని అనుమతులు లేని నిర్మాణాలు తొలగించాలని డిమాండ్ చేశారు. కేటి రోడ్డు వెడల్పు చేసిన తర్వాత ప్రతి షాపు ముందు కాలువలపై ప్లేట్లు వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వాటిని కూడా తొలగించాలని కోరారు. దీనిపై చైర్మన్ బల్ల స్పందిస్తూ కాలువల ఆక్రమాలపై కమిషనర్ కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ తమ గ్రామంలో ఆర్పీగా విధులు నిర్వహిస్తున్న మహిళకే పౌరసరఫరాల శాఖ డిపోను మంజూరు చేశారని ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ విషయమే పలాస మండల తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని మాధవరావు కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు(బుజ్జి), కౌన్సిలర్లు శార్వాణి గీత, అంబటి మాధురి, దున్న నిర్మలతో పాటు కౌన్సిలర్ లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



**నరసన్నపేట, జనవరి 30(వార్త):** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నరసన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.26,000 వేతనం ఇవ్వాలని, కార్మికులపై జరుగుతున్న రాజకీయ వేధింపులను తక్షణమే నిలిపివేయాలని నినాదాలు చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అహింస, శాంతి మార్గాలే గాంధీజీ ఆయుధాలు



**నరసన్నపేట, జనవరి 30(వార్త):** అహింస, శాంతి మార్గాలను ఆయుధాలుగా చేసుకొని దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత మహాత్మా గాంధీజీకే దక్కుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, గాంధీజీ ఆశయాలు నేటికీ ప్రాసంగికమేనని, అహింస, శాంతి మార్గంలో నడిచినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రత్యేకంగా నేటితరం యువత గాంధీజీ చూపిన మార్గాన్ని అనుసరించి విలువలతో కూడిన జీవితం గడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ సేవలు ఎనలేనివి



**నరసన్నపేట, జనవరి 30(వార్త):** దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని పోరాటాన్ని చేసిన ఘనత మహాత్మా గాంధీజీకే దక్కుతుందని ఎంపీపీ అరంగి మురళీధర్ అన్నారు. శుక్రవారం నరసన్నపేట మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి మరియు అహింస మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గాంధీజీని గాడ్సే హత్య చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాలొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## డిప్యూటీ ఎంపీడీవో సేవలకు అభినందనలు



**సోంపేట జనవరి 30(వార్త):** సోంపేట మేజర్ పంచాయతీ ఈవోగా, డిప్యూటీ ఎంపీడీవో గా అహర్నిశలు కష్టపడుతూ ప్రజల సౌకర్యం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలతో మమేకమవుతున్న ఎం శాంతకుమారిని బీసీ సంక్షేమ సంఘం తరపున ఎల్ గోవిందరాజులు తదితరులు అభినందించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇచ్చిన మాట కట్టుబడి డైలీ మార్కెట్లో విపరీతంగా వచ్చిన వాహనాల రద్దీని నివారించేందుకు అడ్డుకట్ట వేసి ప్రజలకు సౌకర్యం కల్పించిన ఈవో తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## డిగ్రీ కాలేజీలో 'ఈగల్' సమావేశం

**ఇచ్ఛాపురం, జనవరి 30 (వార్త):** ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో డ్రగ్స్ గంజాయి పై ఈగల్ బృందం తో అవగాహన సమావేశం నిర్వహించారు.లెక్చరర్ లు దుర్యోధన, శివ కుమార్,సీతమ్మ బృందావనం, సంతోష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.





## అమర వీరుల త్యాగాలు మరువలేనివి



**నరసన్నపేట, జనవరి 30(వార్త):** దేశ రక్షణ కోసం ఎనలేని సేవలు చేసిన అమర జవానుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని హెచ్ఎం రత్నమాల అన్నారు. శుక్రవారం నరసన్నపేట మండలం సత్యవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాత్మా గాంధీ గాడ్సే చేతిలో హతమైన సందర్భాన్ని గుర్తు చేస్తూ ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి



**సారవకోట, జనవరి 30(వార్త):** విద్యార్థులు ఇష్టపడి చదివి సత్ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందని ఎంఈఓ--1 వెంకటరమణ అన్నారు. శుక్రవారం చిన్న కిట్టాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో ఉన్నత ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. చదువుపై ఆసక్తి పెంచుకుని నిరంతర సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయులు బోధనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధన పద్ధతులను అమలు చేయాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే యాక్షన్ ప్లాన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రెడ్డిక సంఘం పరామర్శ



**ఇచ్ఛాపురం, జనవరి 30 (వార్త):** ఇచ్ఛాపురం జోన్ రెడ్డిక సంఘం ప్రతినిధులు లొద్దపుట్టిలోని తిప్పన నాగరాజు రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. నాగరాజు అక్క ముడియా దేవమ్మ అనారోగ్యంతో ఇటీవలి మృతి చెందారు. ఆ కుటుంబన్ని రెడ్డిక సంఘ ప్రతినిధులు ఆసి చిరంజీవులు రెడ్డి, దుర్గాసి పాపా రావు,ఆసి కృష్ణా రెడ్డి, అసి గిరి,దక్కత నూకయ్య, ఢిల్లీ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## తహశీల్దార్‌కి టీడీపీ నాయకుల అభినందన

**ఇచ్ఛాపురం, జనవరి 30 (వార్త):** ఇచ్ఛాపురం తహశీల్దార్ వెంకటరావుకి అవార్డు వచ్చిన సందర్భంగా తెలుగుదేశం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ ప్రధాన కార్యదర్శి నందిగం కోటేశ్వరరావు, కొర్రాయి ధర్మరాజు, నీలపు వెంకట రెడ్డి, లోపింటి తారకేసు, దట్టి శ్రీను, రంగాల శ్రీను అభినందనలు తెలియజేశారు.



## సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్ ప్రమాదకరం: బగ్గు




**నరసన్నపేట, జనవరి 30(వార్త):** నేటి సమాజంలో వాహనాలపై ప్రయాణిస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం అత్యంత ప్రమాదకరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడు రహదారులపై ఎక్కడ చూసినా సెల్‌ఫోన్‌ను మెడ కింద ఉంచుకొని బైక్లపై ప్రయాణించడం సాధారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్లక్ష్యపు అలవాట్లు ప్రమాదాలకు దారితీస్తాయని, వెంటనే ఈ విధానాన్ని నిలిపివేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని, చిన్నపాటి అప్రమత్తతే పెద్ద ప్రమాదాలను నివారించగలదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పులు లేని రెవెన్యూ రికార్డులను రూపొందించాలి



**జి.సిగడాం, జనవరి 30(వార్త):** జి.సిగడాం మండలంలో రీ సర్వేలో భాగంగా భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని ఎం.సరిత అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారులు సర్వేయర్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అత్యంత పారదర్శకంగా, తప్పులు లేని రెవెన్యూ రికార్డులను రూపొందించాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన భూములకు సంబంధించి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి, అర్హులైన రైతులందరికీ, కచ్చితమైన వివరాలతో పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. వ్యక్తిగతంగా భూముల వివరాలను పరిశీలించి, సంబంధిత రైతులతో మాట్లాడి ఈకేవైసీ చేయాలన్నారు. రెవెన్యూ క్లినిక్‌లకు పదేపదే అదే వినతులు వస్తున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుందని, దీనిపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నిర్మల, రీసర్వే డీటీ కొత్తపల్లి గాయత్రి, సర్వేరు శాంతా రావు, ఆర్ఐ రాధ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్నోవేషన్ విద్యా విధానాలు అందించడమే లక్ష్యం

**పలాస, జనవరి 30 (వార్త):** ఇన్నోవేషన్ ఆధారిత విద్యా విధానాలు అందించడంతోపాటు విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాదని మేధస్సు, నైతికత, భావోద్వేగ పరిపక్వత, జీవన నైపుణ్యాల సమగ్ర వికాసం పెంపొందించడమే ధనిక్ భారత్ లక్ష్యమని ఆ సంస్థ డైరెక్టర్ బాలలత అన్నారు. శుక్రవారం సూర్య రాజ్ ఇన్ కళ్యాణ మండపంలో పలాస కాశీబుగ్గకు చెందిన విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పారసాంబకు చెందిన ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ తన వద్ద శిక్షణ పొందారని గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన భారత్ దిశగా ధనిక్ భారత్ విద్యా ఉద్యమం చేపడుతున్నదని అన్నారు. ఎంతో దూర దృష్టితో ఈ సంస్థ ను వ్యవస్థాపకులు విక్రమ్ నారాయణ ప్రారంభించారని ఆంధ్ర తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఇంటర్ అయిన తర్వాత ఏం చేయాలో విద్యార్థులకు అవగాహన ఉండదని వారికి ఒక లక్ష్యం వైపు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ సంస్థ విద్యార్థులను తీర్చిదిద్దుతుందని, విద్యార్థులను అకాడమిక్ విజయం వృత్తిపరమైన నైపుణ్యం మరియు వాస్తవ జీవిత సవాళ్లను సిద్ధం చేయడంలో కీలక పాత్ర వహిస్తామన్నారు. ఒత్తిడి లేని విద్యా వాతావరణం క్రమం తప్పని కౌన్సిలింగ్ ద్వారా విద్యార్థుల్లో మానసిక స్థైర్యం జీవిత లక్ష్య స్పష్టత పెంపొందించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అజయ్ విక్రం, పెండేల మస్తాన్ రావులతో పాటు డాక్టర్ సలీం పాల్గొన్నారు.



## వీవీకేలో ఘనంగా ఫేర్‌వెల్ డే

**సోంపేట, జనవరి 30(వార్త):** సోంపేటలోని వివేకానంద విద్యా కేంద్ర శిశుమందిర్ లో శుక్రవారం ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి వల్లభరావు అధ్యక్షతన ఎంఈఓ జరాడు రిటైర్డ్ ఎంఈఓ జోగారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభా కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి అతిథులు మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుండి చదువుల్లో పోటీ తత్వం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ప్రతి తరగతిలోనూ అత్యుత్తమ మార్కులు సాధించి పాఠ్యాంశాలు పూర్తిగా అవగాహన చేసుకోవాలని అన్నారు. అప్పుడే ఉన్నత విద్యలో ఉత్తమంగా రాణిస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యం కోసం ఇప్పటినుంచే ప్రణాళిక బద్ధంగా విద్యార్థులు కృషి చేయాలని అందుకు ఉపాధ్యాయులు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.



# కల్తీ నెయ్యి సూత్రధారులపై చర్యలేవీ?

**-ఎమ్మెల్యే కూన రవికుమార్**

**-ఆయన ఆధ్వర్యంలో**

**ఆమదాలవలసలో భారీ నిరసన ర్యాలీ**

**ఆమదాలవలస, జనవరి 30(వార్త):** టీటీడీ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాలవలసలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కల్తీ నెయ్యితో లడ్డులు తయారుచేసి రూ.350 కోట్లు అవినీతి పాలంనడిన జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ వాళు సిగ్గు, లజ్జ లేకుండా





అచ్చొచ్చిన ఆంబోతుల లాగా మాట్లాడుతున్నారని ధ్వజమె త్తారు. ఏపీకి కాలకేయుడిలాగా జగన్ తయారై హిందువుల మనోభావాలు దెబ్బ తీశారని తూర్పారబట్టారు. ఎవరి లబ్ధికోసం మీరు అప్పట్లో టీటీడీ నిబంధనలు మార్చారని,అడ్డంగా దొరికినా ఇపుడు దబాయిస్తున్నారన్నారు. ఏడుకొండలు కాదు ఐదు కొండలని మాట్లాడిన వారు కాలగర్భంలో కలిసిపోయారని గుర్తు చేశారు. చట్టం నుంచి జగన్ తప్పించుకోవచ్చు కానీ వెంకటేశ్వర స్వామి పంజా నుంచి తప్పించుకోలేడని, ఆ వెంకటేశ్వర స్వామి తప్పనిసరిగా శిక్షిస్తాడన్నారు. చైర్మన్ దగ్గర ఉన్న అటెండర్ స్కామ్ చేయగలరా..? అప్పటి చైర్మన్ పై ఎందుకు చర్యలు తీసుకోరని సిట్‌ను ప్రశ్నించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో చిట్ట చివర ఉన్న పాత్రధారులు కాదు సూత్రధారులు బయటికి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ మున్సి పల్ చైర్మన్ తమ్మినేని గీత విద్యాసాగర్ , నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర డైరెక్టర్ బోనెల అప్పారావు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసులపై దాడి .. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

**పలాస, జనవరి 30(వార్త):** కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి అక్రమ రవాణా అడ్డుకునే క్రమంలో పోలీసులపై దాడి కేసులో నిందితుడికి సోంపేట సబ్ కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2024 మార్చి 2న వేకువజామున సుమారు 3 గంటల సమయంలో టాస్క్ ఫోర్స్ శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్ ఉత్తర్వుల మేరకు ఫిర్యాదిదారు గోరు ప్రభాకర్‌రావు, వారి సిబ్బంది, కాశీబుగ్గ నేషనల్ హైవే-16 రోడ్డుపై నెమలి నారాయణపురం గ్రామ పరిధిలో ఆర్‌జే32జీసీ 6432 నంబర్ కంటైనర్ లారీ ద్వారా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం ఆధారంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ లారీని ఆపేందుకు ప్రయత్నించగా, లారీ డ్రైవర్ సుభాష్ బాగల్ .. అతివేగంగా లారీని పోలీసులపైకి దూసుకువెళ్లి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై అప్పటి కాశీబుగ్గ ఇన్‌స్పెక్టర్ పి.పారినాయుడు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐలు డి.మోహనరావు, ఎన్.హెచ్.విజయానంద్, పి.సూర్యనారాయణ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి సాక్ష్యాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దువ్వు జగన్నాయకులు బలమైన వాదనలు వినిపించగా, సబ్ కోర్టు, సోంపేట న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు శుక్రవారం ముద్దాయికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి కేసు దర్యాప్తు, అభియోగాల నిరూపణకు కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించారు.

## మాజీ సైనికుల సంక్షేమమే 'వీర్ పరివార్' లక్ష్యం

**డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు**




**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** దేశం కోసం సేవలందించిన మాజీ సైనికుల సంక్షేమం, వారి కుటుంబాల రక్షణే లక్ష్యంగా 'నాల్సా వీర్ పరివార్ సహాయత యోజన-2025'ను ప్రవేశపెట్టినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పెద్దరెల్లి వీధిలోని జిల్లా సైనిక్ బోర్డు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన లీగల్ సర్వీస్ క్లినిక్ను ప్రారంభించి, మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. మాజీ సైనికుల న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు ఈ క్లినిక్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇక్కడ నియమితులైన ప్యానెల్ లాయర్, పారా లీగల్ వాలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉంటారు. పదవీ విరమణ చేసిన సైనికులు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ జడ్జి (పోక్సో) ఎన్. సునీత, ప్యానెల్ అడ్వకేట్ వి. జ్యోతిర్మయి, పారా లీగల్ వాలంటీర్ కె. ఆదిత్య కుమార్, కెప్టెన్ పి. ఈశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్షరాస్యులుగా మారి.. ఆదర్శంగా నిలవాలి

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* సింగుపురంలో అక్షర ఆంధ్ర కేంద్రం పరిశీలన



**శ్రీకాకుళం రూరల్, జనవరి 30(వార్త):** జిల్లాలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అభ్యాసకులు పట్టుదలతో చదువుకుని ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం గ్రామంలోని 'అక్షర ఆంధ్ర - ఉల్లాస్' కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దవీధిలోని వాలంటీర్ టీచర్లు ఎన్.స్వాతి, జి.రమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించిన కలెక్టర్, అభ్యాసకులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా అభ్యాసకులు రాస్తున్న తీరును, వారి చదివే సామర్థ్యాన్ని కలెక్టర్ స్వయంగా పరీక్షించారు. అనంతరం టీసీఎస్ వారు రూపొందించిన వీడియో పాఠాలను ప్రదర్శించి, వాటి ద్వారా సులువుగా నేర్చుకోవాలని సూచించారు. మార్చి 29న నిర్వహించనున్న ఎఫ్.ఎల్.ఎన్.ఏ.టి పరీక్షకు అభ్యాసకులందరూ తప్పనిసరిగా హాజరై, ఉత్తీర్ణత సాధించి జిల్లాను అక్షరాస్యతలో ముందుంచాలని పిలుపునిచ్చారు. సింగుపురం గ్రామంలో ప్రస్తుతం 340 మంది అభ్యాసకులు ఉండగా, వారికి 34 మంది వాలంటీర్ టీచర్ల ద్వారా విద్యాబోధన చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీడీఓ ప్రకాశరావు, వయోజన విద్య ఏడీ సోమేశ్వరరావు, ఏపీఓ బాలచందర్, డిప్యూటీ ఎంపీడీఓలు సూర్యనారాయణ, తులసీదాస్, డ్వామా ఏపీఓ సీతారామ్, వీఆర్వో విశ్వేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాయిజన్ తాగిన యువకుడు

**సంతబొమ్మాళి, జనవరి30(వార్త):** నరసన్నపేట మండలం శివరాంపురం గ్రామానికి చెందిన బోర మల్లేష్ మూలపేట పోర్టులో సూపర్వైజర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని వచ్చి పాయిజన్ తాగి నౌపడలో గిలగిలా కొట్టుకుంటున్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆశ కార్యకర్త పద్మ తక్షణమే 108 కు కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్థానిక పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ తోపాటు గోవిందపురం పీహెచ్సీ డాక్టర్ వినయ్ కుమార్, ఫార్మసిస్ట్ సుబ్రమణ్యం కలిసి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎందుకు పాయిజన్ తాగారన్నది కుటుంబ సభ్యులకు కూడా తెలియలేదు. ప్రస్తుతం మల్లేష్ ఆరోగ్యం నిలకడగా ఉంది.

## జిల్లాలో 2,478 టన్నుల యూరియా నిల్వలు

**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** జిల్లాలో రబీ సాగుకు ఎరువులు శుక్రవారం నాటికి జిల్లాలోని వివిధ కేంద్రాల్లో 2,478 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి కె. త్రినాథ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్సీఎఫ్, స్పిక్ కంపెనీల నుండి 1,653 టన్నుల కొత్త స్టాక్ గురువారమే జిల్లాకు చేరుకుందని వివరించారు. ఇప్పటివరకు 19,612 టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్లు తెలిపారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




**పలాస, జనవరి 30(వార్త):** చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి గురుదాసుపురం గ్రామాన్ని సందర్శించి, నారీ శక్తి, సైబర్ నేరాలు, సంకల్పం, మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు మొదలైన వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్వాడీల్లో సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని, మహిళలు ఓటీపీ షేర్ చేయకూడదు, 1930కు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. నారీ శక్తి, సైబర్ నేరాలు, సంకల్పం, మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు అనే అంశాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో కీలకమైనవని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ అంశాలపై ప్రభుత్వం, స్థానిక సంస్థలు చురుకుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. సంకల్పం అంటే దృఢ పట్టుదలతో మహిళల స్వరక్షణ ప్రతిజ్ఞలు తీర్చుకోవడం. ఎన్టీఆర్ విద్య సంకల్పం లాంటి పథకాలు డ్వాక్రా మహిళల పిల్లల విద్యకు రుణాలు అందిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు రహిత సమాజమే ధ్యేయం కావాలి

**- డీఎంహెచ్‌వో అనిత**

**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డా.కె.అనిత అధ్యక్షతన జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టి.బి. కంట్రోల్ ఆఫీసర్ డా. తాడెల శ్రీకాంత్ ఆధ్వర్యంలో జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీని ఉద్దేశించి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్రాన్ని కుష్టు రహిత సమాజంగా మార్చేందుకు ప్రతీ పౌరుడు కృషి చేయాలన్నారు. కుష్టు వ్యాధి బారిన పడిన వ్యక్తులు, కుటుంబ సభ్యులపై వివక్షత చూపరాదని వారి గౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రె అను సూక్ష్మ జీవి ద్వారా వ్యాపిస్తుందని, ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే బహుళ ఔషధ చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయము నుండి 7 రోడ్ల కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో డిప్యూటీ డి.ఎమ్.హెచ్.ఓ డా. మేరీ కేథరిన్, ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రామ్ అధికారి డా.శివరంజని, డి.ఎన్.ఎమ్.ఓ డా.ప్రవీణ్, పి.ఎమ్.ఓ లోకాభాయ్, డిప్యూటీ డెమో కె. యర్రన్న, డిప్యూటీ హెచ్.ఇ.ఓ ఎస్. విజయలక్ష్మి, పి. మోహిని, కార్యాలయ సిబ్బంది, ఎ.ఎన్.ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## చివరి చూపును చేరువ చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్

* ఇరాక్‌లో మృతి చెందిన కంచిలి మండలం జాడుపూడి వాసి
* ఇరాక్ ఎంబసీతో నిరంతర సంప్రదింపుల నేపథ్యంలో డిల్లికి చేరుకున్న మృతదేహం
* శనివారం జాడుపూడిలో అంత్యక్రియలు
* పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబానికి తోడ్పాటు అందిస్తామని రామ్మోహన్ హామీ

**సోంపేట, జనవరి 30(వార్త) :** పొట్టకూటికోసం ఒంటరిగా పరాయి దేశం వెళ్ళాడు.. అనారోగ్య సమస్యలతో కాలం చేసాడు.. తమ ఇంటిపెద్ద చివరి చూపు కోసం ఆ కుటుంబం వెయ్యి కళ్ళతో ఎదురుచూసింది. ఆ సమస్య కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెంతకు చేరింది. వెంటనే పని మొదలు పెట్టిన రామ్మోహన్ నాయుడు.. ఆ చివరి చూపును చేరువ చేశారు.. పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం జాడుపూడి గ్రామానికి చెందిన పిలక బాలకృష్ణ ఇరాక్ దేశం బాగ్దాద్ లో ప్రోక్లేయిన్ల మెకానిక్‌గా పనికి కుదిరాడు.. గడచిన అయిదేళ్లుగా ఇదే వృత్తి చేసుకుంటూ.. అవకాశం వచ్చినప్పుడల్లా సొంతూరులోని భార్య, ఇద్దరు చిన్నారులను చూసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. అలాంటి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. కొద్ది నెలల క్రితం సొంత ఊరికి వచ్చిన పిలక బాలకృష్ణ.. ఈ జనవరి రెండవ తారీఖున తిరిగి బాగ్దాద్ పయనమయ్యాడు. యధావిధిగా తన వృత్తిని చేసుకుంటూ గడుపుతున్న సమయంలో మెదడు సంబంధిత అనారోగ్య కారణాలతో ఈ నెల పదమూడవ తారీఖున మరణించారు. ఇరాక్ దేశంలోని బాగ్దాద్ లో తెలిసినవారేవ్వరూ తోడు లేకుండా బాలకృష్ణ ఒక్కరే ఉండటం.. అయన మృతి తరువాత ఆ దేహాన్ని చివరి చూపు చూసేందుకు ఆ కుటుంబం, ఆ గ్రామంలోని పెద్దలంతా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదే సందర్భంలో ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ద్వారా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్ళి.. పరిస్థితిని వివరించారు. దీనిపై వెంటనే చర్యలకు ఉపక్రమించారు కేంద్ర మంత్రి. మన విదేశాంగ శాఖ అధికారులకు పరిస్థితి వివరించి.. ఇరాక్ ఎంబసితో సంప్రదింపులు ముమ్మరం చేశారు. దీంతో అక్కడి నుండి మృతదేహం బయలుదేరి శుక్రవారం నాడు డిల్లి విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడి నుండి సొంత ఊరు పంపించే బాధ్యతను సైతం రామ్మోహన్ నాయుడు తీసుకున్నారు. శనివారం రోజున జాడుపూడి గ్రామానికి బాలకృష్ణ మృతదేహం చేరుకోనుంది.పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి కూడా తోడ్పాటు అందిస్తానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, స్థానికులు రామ్మోహన్ నాయుడు తీసుకున్న చొరవ పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఒంటరిగా దేశం కాని దేశంలో తమవాడు మరణిస్తే.. ఎటూ పాలుపోలేని స్థితిలో తమకు రామ్మోహన్ నాయుడు ఎంతో తోడ్పాటు అందించారని స్పష్టం చేస్తున్నారు.

## సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

* ఆర్జీయూకేటీ డైరెక్టర్ వెంకట ధన బాలాజీ
* 'జెన్ ఏఐ'పై వర్క్‌షాప్ ప్రారంభం




**ఎచ్చెర్ల, జనవరి 30(వార్త):** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొ. కొక్కిరాల వెంకట ధన బాలాజీ సూచించారు. క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'జెన్ ఏఐ ఎస్డీఎల్సీ' అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సారికి టెక్నాలజీస్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆధునిక కృత్రిమ మేధస్సుపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. ఉద్భవిస్తున్న సాంకేతికతల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇటువంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాయోగిక నైపుణ్యాలు పెంపొందించడం, నైతికమైన ఏఐ వినియోగంపై అవగాహన కల్పించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు సాగే ఈ శిక్షణలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో ఏఐ పాత్ర ఆవిష్కరణలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. సి.ఎస్.ఇ విభాగాధిపతి కోడా దిలీప్ కుమార్ కన్వీనర్‌గా, డి. పద్మావతి సహ-కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డా. ఎం. రామకృష్ణ, ఏఓ డా. ముని రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా. వాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు

**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో ప్రముఖ వంశధార నదిపై ఉన్న గొట్ట బ్యారేజ్ లో వివిధ పనుల నిమిత్తం పదహారున్నర కోట్ల రూపాయలు విడుదల కావడం పట్ల వంశధార ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ అరవల రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రుల నుండి ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో కీలక అభివృద్ధి, మరమత్తుల గురించి పలు దఫాలుగా నీటి పారుదల శాఖకు, ముఖ్యమంత్రి దృష్టికి వినతుల రూపంలో పరిస్థితిని వివరించారు. వీటికి స్పందనగా... గొట్టా బ్యారేజి దిగువ అప్రాన్, వరదకట్టలకు రక్షణ చర్యలు చేపట్టేందుకు 16.49 కోట్ల రూపాయల విడుదలకు పరిపాలన అనుమతులు ఇస్తూ.. ప్రభుత్వం బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై స్థానిక చీఫ్ ఇంజనీరు క్షేత్ర స్థాయిలో పూర్తి పరిశీలన చేసి.. నిధుల వినియోగంపై ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయరుచేయ్యమని ఆదేశాలిచ్చింది. గొట్టా బ్యారేజి దిగువ వరధకట్టలు నిర్మాణం లేక, అప్రాన్ కోసం ఇటివల కాలంలో రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులు విశ్వ ప్రయత్నం చేశారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వానికి వివరించారు. ఈ నేపధ్యంలో నిధుల విడుదలకు మార్గం సుగమం కావడంతో వంశధార ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ అరవల రవీంద్ర ఆనందం వ్యక్తం చేశారు. వరధకట్టలు, అప్రాన్ నిర్మాణం జరిగితే అతివృష్టి సమస్యను సులభంగా అధిగమించి.. ప్రాజెక్ట్ దిగువ ప్రాంత భూములు మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546